ప్రజాశక్తి
బుధవారం 7 ఆగస్టు 2024
5
శ్రీకాకుళం

సమగ్ర శిక్ష ఎపిసి బదిలీ

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

సమగ్ర శిక్ష ఎపిసి రోణంకి జయప్రకాష్‌ను ప్రభుత్వం బదిలీ చేసింది. గత ప్రభుత్వ హయాంలో 2021 సెప్టెంబరు ఆరో తేదీన డెప్యుటేషన్‌పై ఎపిసిగా ఆయన నియమితులయ్యారు. అపట్నుంచి ఆ శాఖ పరిధిలో పనిచేసిన ఆయన్ను కూటమి ప్రభుత్వం బదిలీ చేసింది. దీంతో ఆయన్ను రిలీవ్ చేస్తూ కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఉత్తర్వులు జారీ చేశారు. విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, ఎస్‌పిడి ఆదేశాలను అనుసరించి ఆయన్ను రిలీవ్ చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో ఆయన పేర్కొన్నారు. జయప్రకాష్ తన మాతృశాఖ అయిన జూనియర్ కళాశాల లెక్చరర్‌గా తిరిగి విధుల్లో చేరనున్నారు. ఎపిసి తాత్కాలిక బాధ్యతలను జిల్లా విద్యాశాఖాధికారి తిరుమల చైతన్యకు అప్పగించారు.

బీడు భూములకు...
జల'కళ' వచ్చేనా..?

- బోర్ల తవ్వకాలకు మూడేళ్ల కిందట దరఖాస్తుల స్వీకరణ
- 5,714 మంది దరఖాస్తు చేయగా 246 మందికే అవకాశం
- ఖజానాపై భారం పేరుతో ఆపేసిన గత ప్రభుత్వం
- టిడిపి కూటమి ప్రభుత్వంపై రైతుల ఆశలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

కోటబొమ్మాళి మండలం ఊడికలపాడులో ట్రాన్స్‌ఫార్మర్ వేసి కనెక్షన్ ఇవ్వని అధికారులు (ఫైల్)

చిన్న, సన్నకారు రైతులకు మేలు కలిగించేందుకు వైసిపి ప్రభుత్వం సెప్టెంబరు 28, 2020లో జలకళ పథకాన్ని ప్రారంభించింది. బోరు సౌకర్యం లేని 2.5 ఎకరాల నుంచి ఐదు ఎకరాల వరకు ఉన్న రైతులను అర్హులుగా పేర్కొంది. బోర్ల తవ్వకం, విద్యుత్ కనెక్షన్లను ఉచితంగా ఇస్తామంటూ ప్రకటించింది. ప్రస్తుతం అందులో మార్పులు చేయడంతో అన్నదాతలు ఉసూరుమంటున్నారు. ఐదెకరాల్లోపు వారికి సైతం రూ.రెండు లక్షల్లోపు మాత్రమే విద్యుత్ కనెక్షన్ల ఖర్చు చేస్తామని, అంతకంటే ఎక్కువైతే రైతులే భరించాల్సి ఉంటుందని పేర్కొంది. అయినా రైతులు ఖర్చుకు వెనుకాడకుండా బోర్లు తవ్వించుకోవడానికి సిద్ధపడ్డారు. జిల్లాలో వైఎస్సార్ జలకళ పథకం కోసం మొత్తం 5,714 దరఖాస్తులు వచ్చాయి. వాటిలో 4,690 దరఖాస్తులు అర్హమైనవిగా తేల్చారు. వాటిలో 2,299 చోట్ల సర్వే పూర్తి చేశారు. సర్వే పూర్తయిన వాటిలో 1057 ప్రాంతాల్లో బోర్ల తవ్వకాలకు అధికారులు అనుమతులు మంజూరు చేశారు. ఇప్పటివరకు 246 చోట్ల బోర్లు తవ్వారు. 229 ప్రాంతాల్లో నీళ్ల పడగా 17 చోట్ల నీరు పడలేదు. 13మంది రైతుల పొలాలకు విద్యుత్ కనెక్షన్లు ఇచ్చారు.

అర్ధాంతరంగా బోర్ల తవ్వకాలు నిలిపివేత

సాధారణంగా ఒక ట్రాన్స్‌ఫార్మర్, నాలుగు విద్యుత్ స్తంభాలు వేస్తే రూ.రెండు లక్షల అంచనా వ్యయం దాటిపోతుంది. లబ్ధిదారుల్లో ఎక్కువ మంది ఒకటి నుంచి రెండు కిలోమీటర్ల మేర స్తంభాలు వేయాల్సిన వారు ఉన్నారు. ట్రాన్స్‌ఫార్మర్‌తో కలిపితే వారికి రూ.ఐదు లక్షల నుంచి రూ.ఆరు లక్షలు దాటిపోతోంది. ప్రభుత్వం కనీసం రూ.రెండు లక్షలు ఇచ్చినా మిగిలిన ఖర్చు భరించేందుకు రైతులు సిద్ధంగా ఉన్నారు. అయినా ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పందన కనిపించడం లేదు. ఐదెకరాల్లోపు ఉన్న రైతులకు రూ.రెండు లక్షల వరకు విద్యుత్ కనెక్షన్ ఖర్చు ప్రభుత్వమే భరిస్తుందని చెప్పినా, ఆ తర్వాత ఎవరికీ డబ్బులు చెల్లించలేదు. ఎక్కడా ఒక్క కనెక్షన్ ఇవ్వలేదు. కొన్నిచోట్ల విద్యుత్‌శాఖ కనెక్షన్లు ఇచ్చినా వాటికైన ఖర్చునూ ప్రభుత్వం చెల్లించలేదని తెలుస్తోంది. ప్రభుత్వం విద్యుత్ శాఖకు డబ్బులు ఇవ్వకపోవడంతో కనెక్షన్లు ఆపేసింది. దీంతో బోర్లు తవ్వి విడిచిపెట్టేయంతో చాలాచోట్ల మట్టి కూరుకుపోయింది. తమకు త్వరగా విద్యుత్ సరఫరా అయ్యేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

> **సాగునీటి సౌకర్యం లేక నిరుపయోగంగా మారిన భూములను వినియోగంలోకి తెచ్చేందుకు గత ప్రభుత్వం వైఎస్ఆర్ జలకళ పథకాన్ని ఎంతో ఘనంగా ప్రారంభించినా, అనుకున్న లక్ష్యాన్ని చేరుకోలేకపోయింది. బోర్లతో పాటు విద్యుత్ కనెక్షన్‌నూ అందిస్తామని చెప్పడంతో, రైతులు ఉత్సాహంగా దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తుల స్వీకరణ, సర్వే పూర్తి చేసి అర్హులైన వారికి అధికారులు అనుమతులు మంజూరు చేశారు. తొలుత పూర్తి ఖర్చు తామే భరిస్తామని ప్రభుత్వం చెప్పింది. తర్వాత రూ.రెండు లక్షల వరకు చెల్లిస్తామంటూ ఉత్తర్వులు జారీ చేసింది. రైతులు అదనపు ఖర్చుకు సిద్ధపడినా ప్రభుత్వం నుంచి స్పందన లేక ఆ పథకం అలానే నిలిచిపోయింది. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో రైతుల్లో ఆశలు రేకెత్తుతున్నాయి.**

నిధుల కేటాయింపు జరిగేనా?

చిన్న,సన్నకారు రైతులను ఆదుకునేందుకు గతంలో ఇందిర జలప్రభ, ఎన్‌టిఆర్ జలసిరి పేర్లతో ప్రభుత్వాలు అమలు చేశాయి. వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత కొన్ని మార్పులు చేసి వైఎస్సార్ జలకళగా పేరు మార్చింది. బోర్లు, విద్యుత్ కనెక్షన్లు ఉచితంగా ఇస్తామని ప్రకటించడంతో రైతులు ఆశతో దరఖాస్తు చేసుకున్నారు. ప్రారంభం నుంచి పలు నిబంధనలు మార్చడం, గిట్టుబాటు కాక డ్రిల్లింగ్ ఏజెన్సీలు ముందుకు రాకపోవడం, నిధుల లేమి, బిల్లుల చెల్లింపుల్లో జాప్యం తదితర కారణాలతో పురోగతి కనిపించడం లేదు. జిల్లాలో ఎచ్చెర్ల, ఆమదాలవలస, పలాస నియోజకవర్గాల్లో మాత్రమే బోర్ల తవ్వకాలకు డ్రిల్లింగ్ ఏజెన్సీలు ముందుకు వచ్చాయి. ప్రభుత్వం చెల్లిస్తున్న ధర గిట్టుబాటు కావడం లేదంటూ మిగిలిన నియోజకవర్గాల్లో ఏజెన్సీలు ఆసక్తి చూపడం లేదు. రాష్ట్రంలో టిడిపి కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఒక్కొక్క శాఖపై సమీక్షిస్తున్న నేపథ్యంలో దీనిపై ఏం నిర్ణయం తీసుకోనున్నారో చూడాల్సి ఉంది. ఇప్పటికే రాష్ట్ర ఖజానా ఖాళీ అయిపోయిందంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పలు సమావేశాల్లో పదేపదే చెప్తున్నారు. ఈ నేపథ్యంలో జలసిరి పథకానికి ఎంతమేర నిధులు కేటాయిస్తారనేది వేచి చూడాల్సి ఉంది.

మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు

మున్సిపల్ కార్మికులపై వేధింపులు ఆపాలి

- సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి తేజేశ్వరరావు
- నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద కార్మికుల ధర్నా

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

మున్సిపల్ కార్మికులపై వార్డు సెక్రటరీలు, టిడిపి వార్డు ఇన్‌ఛార్జీల వేధింపులు ఆపాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎన్.బలరాం, ఎ.గణేష్ డిమాండ్ చేశారు. ఫెడరేషన్ ఆధ్వర్యాన కార్మికులు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం వద్ద మంగళవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చనిపోయిన కాంట్రాక్టు కార్మికుల కుటుంబాలకు ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మికులపై పనిభారం పెరుగుతోందని తెలిపారు. కార్పొరేషన్ విస్తీర్ణ పరిధి పెరిగిందని, దానికి తగినట్లుగా పారిశుధ్య కార్మికులను పెంచకుండా ఉన్న వారితోనే వెట్టిచాకిరీ చేయిస్తున్నారని విమర్శించారు. పని ప్రదేశాల్లో మహిళలకు మరుగుదొడ్లు లేవని, కార్మికుల విధి నిర్వహణకు అవసరమైన పనిముట్లు లేకుండా ఎలా పనిచేయాలని ప్రశ్నించారు. దీనిపై పలుమార్లు మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోలేదని విమర్శించారు.

మస్టర్ పాయింట్ల వద్దే ఎఫ్ఆర్ఎస్ తీయాలని, కార్మికులకు పనిముట్లు తక్షణమే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆఫీసులో ఉన్న పిహెచ్ వర్కర్లను, రాజకీయ నాయకుల వద్ద నుంచి వచ్చిన పిహెచ్ వర్కర్లను శానిటేషన్ వర్క్‌లో కొనసాగించాలన్నారు. కార్మికులకు క్షేత్రస్థాయిలో ఇన్‌స్పెక్టరు వార్డు సెక్రటరీ, టిడిపి వార్డు ఇన్‌ఛార్జీలు వేర్వేరు పనులు చెప్తున్నారని, ఒకే వ్యక్తి అన్ని పనులు చేయడం ఎలా సాధ్యమని ప్రశ్నించారు. వారిలో ఏ ఒక్కరు చెప్పిన పనిచేయలేకపోయినా కార్మికులపై ఒత్తిడి తెచ్చి భయభ్రాంతులకు గురిచేస్తున్నారని చెప్పారు. ప్రతి ప్రాంతానికి ఈ మూడు పనులకు చొప్పున కార్మికులను కేటాయించాలని డిమాండ్ చేశారు. అనంతరం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ చల్లా ఓబులేసుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సిఐటియు నగర కన్వీనర్ ఆర్.ప్రకాశరావు, డి.యుగంధర్, ఎ.గురుస్వామి, ఎ.శంకర్, ఎ.రాము, డి.చిట్టి, ఎ.మాధవి, టి.వెంకటలక్ష్మి, ఎ.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఇసుక మేటలతో వేటకు దూరం

తొలగించాలని కోరుతున్న భావనపాడు మత్స్యకారులు

ప్రజాశక్తి - నౌపడ

సమావేశంలో మాట్లాడుతున్న భావనపాడు మత్స్యకారులు

సంతబొమ్మాళి మండలం భావనపాడు సముద్ర తీరంలోని ఫిషింగ్ హార్బర్ వద్ద భారీగా ఇసుక మేటలు వేయడంతో బోట్లపై వేటకు వెళ్లలేకపోతున్నామని భావనపాడు మత్స్యకారులు తెలిపారు. ఇసుక మేటల కారణంగా చేపల వేటలో ఎదురవుతున్న ఇబ్బందులపై ఆ గ్రామానికి చెందిన పలువురు నాయకులు, మత్స్యకారులు మంగళవారం సమావేశమయ్యారు. ఎన్నో ఏళ్లుగా భావనపాడులో నివసిస్తున్నామని, ఎప్పుడూ ఇలాంటి ఇసుక మేటలతో ఇబ్బంది రాలేదని చెప్పారు. గ్రామానికి రెండు కిలోమీటర్ల దూరంలో నిర్మిస్తున్న మూలపేట పోర్టుకు బ్రేక్ వాటర్ పనులు చేపడుతుండడంతో, అందులో వాడే ఇసుక సముద్రపు ఆటుపోట్లకు భావనపాడు హార్బర్ వద్ద మేటలుగా ఏర్పడుతున్నాయని తెలిపారు. హార్బర్‌లో సుమారు అర కిలోమీటరు దూరం వరకు ఐదు మీటర్ల ఎత్తులో మేటలు ఏర్పడ్డాయని చెప్పారు. దీనివల్ల సముద్రంలోకి బోట్లు వెళ్లేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. తెగించి వెళ్తే ప్రమాదాల బారిన పడుతున్నామని, బోట్లు దెబ్బతింటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వేట నిషేధ కాలం ప్రారంభమైన ఏప్రిల్ 15వ తేదీ నుంచి నేటి వరకు సముద్రంలోకి వేటకు వెళ్లలేక, చేసేందుకు పనులు లేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోయారు. ఇసుక మేటల కారణంగా చేపల వేట నిషేధం పూర్తయినా వేటకు వెళ్లలేని పరిస్థితులు నెలకొన్నాయన్నారు. దీనిపై గత నెల 30న రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడును కలిసి సమస్య వివరించినట్లు చెప్పారు. తమ సమస్యను అర్థం చేసుకొని వీలైనంత త్వరగా ఇసుక మేటలు తొలగించేందుకు డ్రెజ్జింగ్ పనులు చేపట్టాలని, మళ్లీ ఇటువంటివి పునరావృతం కాకుండా శాశ్వత చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో టిడిపి నాయకులు తులసీదాస్, అడ్డ దానేసు, మత్స్యకారులు కారాడ అప్పలస్వామి, రామస్వామి, అప్పలస్వామి, బి.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

11న 5కె మారథాన్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

హెచ్‌ఐవి, ఎయిడ్స్‌పై యువతలో అవగాహన కల్పించేందుకు విస్తృత ప్రచారం చేయాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి బి.మీనాక్షి అన్నారు. ఇందులో భాగంగా ఈనెల 11న నగరంలోని 80 అడుగుల రోడ్డులో 5 కిలోమీటర్ల మారథాన్ రెడ్ రన్ నిర్వహించనున్నట్లు తెలిపారు. నగరంలోని జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో ఎయిడ్స్ నియంత్రణ, నివారణ విభాగం ఆధ్వర్యాన యువ సమ్మేళన సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మారథాన్‌లో 17 నుంచి 25 ఏళ్ల లోపు యువతీ యువకులు, ట్రాన్స్‌జెండర్లు పాల్గొనాలని కోరారు. ఇందులో పాల్గొనే వారు ఈనెల ఎనిమిదో తేదీ సాయంత్రం ఐదు గంటల్లోగా 9494474266 ఫోన్ నంబరుకు ఫోన్ చేసి నమోదు చేసుకోవాలని సూచించారు. మారథాన్ విజేతలకు ప్రథమ బహుమతి రూ.ఏడు వేలు, ద్వితీయ బహుమతి రూ.నాలుగు వేలు, క్విజ్ విజేతలకు ప్రథమ బహుమతి రూ.ఏడు వేలు, ద్వితీయ బహుమతి రూ.ఐదు వేలు అందజేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో ఎయిడ్స్ నియంత్రణాధికారి డాక్టర్ శ్రీకాంత్, ఆదిలింగం, క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ శ్రీధర్, నెహ్రూ యువ కేంద్రం కోఆర్డినేటరు వెంకట్ ఉజ్వల్, సెట్‌శ్రీ సిఇఒ ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డిఎంహెచ్‌ఒ మీనాక్షి

నూతన ఆవిష్కరణలు జరగాలి

ప్రజాశక్తి - ఎచ్చెర్ల

సమాజ ప్రయోజనాన్ని దృష్టిలో ఉంచుకుని నూతన ఆవిష్కరణలు చేయాల్సిన అవసరముందని నాగార్జున విశ్వవిద్యాలయం పూర్వ ఉపకులపతి, బిఆర్ఎయు అంబుడ్స్‌పర్సన్ ఆచార్య వి.బాలమోహన్‌దాస్, విశ్రాంత ప్రిన్సిపాల్ జి.వెంకటకృష్ణయ్య అన్నారు. స్థానిక డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాల ప్రథమ సంవత్సర విద్యార్థులకు పరిచయ కార్యక్రమాన్ని బిఆర్ఎయు సెమినార్ హాల్‌లో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజహితాన్ని, ప్రకృతి పరిరక్షణ, విలువలను కాపాడే సాంకేతిక విజ్ఞానం అవసరమని అభిప్రాయపడ్డారు. జీవితంలో ఎంత అత్యున్నత సాంకేతిక పరిజ్ఞానాన్ని పొందినా అది సమాజ వినాశకాన్ని కోరుకోరాదని సూచించారు. గత శతాబ్ది కాలంలో ప్రపంచం ఎన్నో నూతన, ప్రయోజనకర అవిష్కరణలకు వేదిక అయిందంటే ఎంతోమంది ఇంజినీర్ల కృషి అని కొనియాడారు. బిఆర్ఎయు వైస్ ఛాన్సలర్ కె.ఆర్ రజని మాట్లాడుతూ ఎంచుకున్న రంగంలో ఎంత సాంకేతికత నైపుణ్యత సాధించినా మంచి పుస్తకాలు, ప్రముఖుల జీవితాలను చదవడాన్ని ఎన్నడూ విస్మరించరాదన్నారు. ఆలోచనలు, అవిష్కరణలు, వనరులు, సంపద సృష్టించడంలో విద్యార్థులు భావితరాలకు ఆదర్శంగా నిలవాలన్నారు. మరోవైపు కెరీర్‌తో పాటు పారిశ్రామికవేత్తలుగా ఎదిగేలా విశ్వవిద్యాలయాలు ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో వర్సిటీ రెక్టార్ ఆచార్య బి.అడ్డయ్య, రిజిస్ట్రార్ పి.సుజాత, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిహెచ్.రాజశేఖరరావు, ఒడిఎస్ డాక్టర్ యు.కావ్యజ్యోత్స్న తదితరులు పాల్గొన్నారు.

కిడ్నీ ఆస్పత్రికి మౌలిక సౌకర్యాలు

ప్రజాశక్తి - పలాస

కిడ్నీ పరిశోధనా కేంద్రం, 200 పడకల ఆస్పత్రికి మౌలిక సౌకర్యాల కల్పనకు కృషి చేస్తానని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. రూ.53 కోట్ల వ్యయంతో భవనాలు నిర్మించి విడిచిపెట్టారని, పరికరాల కోసం రూ.25 కోట్లు మంజూరు కాగా, ఇంకా రూ.11 కోట్ల విలువైన పరికరాలు పూర్తిగా రాలేదని తెలిపారు. ఎపి మెడికల్ సర్వీసెస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎపిఎంఎస్ఐడిసి) అధికారుల బృందం ఎమ్మెల్యేను మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం కిడ్నీ ఆస్పత్రిలో సౌకర్యాలపై ఎమ్మెల్యే సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత టిడిపి ప్రభుత్వ హయాంలోనే కిడ్నీ పరిశోధనా కేంద్రానికి బీజం పడిందన్నారు.

డిప్యూటీ సిఎం, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ కిడ్నీ ఆస్పత్రి నెలకొల్పాలని సిఫార్సు చేసిన మేరకు దీన్ని అప్పట్లో రూ.50 కోట్లు మంజూరు చేశారని తెలిపారు. వైసిపి ప్రభుత్వం భవనాలు నిర్మించి తామే తెచ్చామని గొప్పలు చెప్పుకున్నారన్నారు. అవసరం మేరకు పరికరాలు లేకుండా, సిబ్బంది నియమకాలు చేపట్టకుండా అప్పటి సిఎం జగన్ ప్రారంభించారని విమర్శించారు. కిడ్నీ ఆస్పత్రికి కావాల్సిన సదుపాయాలు కల్పిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ దీనిపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారని తెలిపారు. సమావేశంలో ఇఇ సత్యప్రభాకర్, డిఇఇ త్రిమూర్తులు, జెఇలు నరేంద్ర, ధనుంజయ, సాయిసురేంద్ర, బి.ఎం దామోదరరావు ఉన్నారు.

అభివృద్ధికి చిరునామాగా అరసవల్లి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

అరసవల్లిని అన్నివిధాలుగా అభివృద్ధి చేసి ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. నగరంలోని శ్రీకాకుళం నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసుతో కలిసి ఖాజీపేట, అరసవల్లి పరిధిలోని పలు ప్రాంతాల్లో మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రముఖ క్షేత్రం సూర్యనారాయణ స్వామి ఆలయం అరసవల్లిలోనే ఉన్నా, కనీస మౌలిక సదుపాయాలు కల్పించకుండా గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. స్వామివారి తిరువీధి నిర్వహించుకునేందుకు మాఢవీధులు సైతం విస్తరించుకోవాల్సి ఉంటుందన్నారు. ప్లాస్టిక్ రహిత ప్రాంతంగా అరసవల్లిని తీర్చిదిద్దాలన్నారు. దళితవాడలో శ్మశానవాటిక ఏర్పాటుకు గతంలో ఉన్న స్థలంలో ఆక్రమణలను తొలగించి ప్రహరీ నిర్మాణానికి ఉన్నతాధికారులతో చర్చించి నిధులు తీసుకొస్తానని తెలిపారు.

బడా కంపెనీలను బహిష్కరించాలి

- 9న జిల్లా, మండల కేంద్రాల్లో నిరసనలు
- జిల్లా రైతు సంఘాల సమన్వయ సమితి పిలుపు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఈనెల 9న క్విట్ ఇండియా దినాన్ని పురస్కరించుకుని బడా కార్పొరేట్ కంపెనీలను బహిష్కరించాలన్న నినాదంతో నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు రైతు సంఘాల సమన్వయ సమితి జిల్లా కన్వీనర్ తాండ్ర ప్రకాష్ పిలుపునిచ్చారు. నగరంలోని క్రాంతి భవన్ లో ఎస్‌కెఎంకె భాగస్వామ్య సంఘాల సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. రైతుసంఘాల నాయకులు కె.మోహనరావు, జి.సింహాచలం, పి.ప్రసాదరావుతో కలిసి మాట్లాడారు. దేశవ్యాప్తంగా ఆలిండియా సంయుక్త కిసాన్ మోర్చా పిలుపులో భాగంగా ఈ కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం బడా కార్పొరేట్ కంపెనీలకు ప్రభుత్వ గ్యారంటీలతో పాటు రూ.లక్షల కోట్ల రాయితీలు, రుణాలను మంజూరు చేసిందని విమర్శించారు. వ్యవసాయ రంగంలో రైతులకు అనుకూలమైన రుణ విమోచన చట్టం, విత్తన చట్టం, స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు అమలు చేయాలంటే కనీసం పట్టించుకోవడం లేదన్నారు. వ్యవసాయ ఉత్పత్తులని పది రెట్లు ఎక్కువగా అమ్ముతున్న బడా కార్పొరేట్ కంపెనీలకు అనేక రాయితీలు, రుణాలను ప్రజాధనాన్ని ఉదార స్వభావంతో అందిస్తున్నారని మండిపడ్డారు. దేశానికి అన్నం పెట్టే రైతుకు మాత్రం నోట్లో మట్టి కొడుతున్నారని దుయ్యబట్టారు. బ్యాంకుల రుణాలు ఎగ్గొట్టిన బడా కంపెనీలకే మళ్లీ రుణాలు మాఫీ చేసి, రుణాలు మంజూరు చేస్తున్నారని ధ్వజమెత్తారు. బిజెపి పాలన బడా కార్పొరేట్ కంపెనీల అనుకూల పాలనగా, అనుకూల చట్టాలు చేసే ప్రభుత్వంగా తయారైందని విమర్శించారు. అన్ని వ్యవసాయోత్పత్తులకు కనీస మద్దతు ధర ప్రకటించాలనే డిమాండ్‌ను నేటికీ నెరవేర్చలేదన్నారు. విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు విక్రయించే కంపెనీలు, అన్ని పంటల ఉత్పత్తులను మార్కెటింగ్ చేసే బడా కంపెనీలను దేశంలో నిషేధించాలని డిమాండ్ చేశారు. రైతులను బడా కంపెనీలు దోపిడీ చేసి వారి రక్తాన్ని పీల్చి పిప్పి చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో దేశవ్యాప్త నిరసనల్లో భాగంగా జిల్లా, మండల కేంద్రాలలో బడా కార్పొరేట్ కంపెనీల ఎదుట చేపట్టే నిరసనలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. రైతులు, వ్యవసాయ కూలీలతో పాటు అన్ని ప్రజాసంఘాల నాయకులు పెద్దఎత్తున పాల్గొనాలని కోరారు.

మాట్లాడుతున్న తాండ్ర ప్రకాష్

జీడికి మద్దతు ధర ప్రకటించాలి

ప్రజాశక్తి - పలాస

80 కేజీల జీడిపిక్కల బస్తాకు రూ.16 వేలు మద్దతు ధర ప్రకటించి, రైతుసేవా కేంద్రాల ద్వారా ప్రభుత్వమే కొనుగోలు చేయాలని జీడి రైతు సంఘం జిల్లా కన్వీనర్ తెప్పల అజయ్ కుమార్ డిమాండ్ చేశారు. స్థానిక ఎమ్మెల్యే గౌతు శిరీష కార్యాలయంలో జీడి రైతుల సంఘం నాయకులు మంగళవారం ఆమెను కలిసి జీడి సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో జీడిపై ఇచ్చిన హామీలను త్వరగా అమలయ్యేలా చర్యలు చేపట్టాలని కోరారు. పలాస కేంద్రంగా జీడి బోర్డు ఏర్పాటు చేయాలని, బ్యాంకుల ద్వారా స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ జీడి రైతాంగానికి అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. జీడిపిక్కల కొనుగోలు అనంతరం విదేశీ పిక్కలను అనుమతించాలన్నారు. జీడి సమస్యలను పరిష్కరించేందుకు కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడుతో చర్చలు చేసి కేంద్ర పంటల జాబితాలో జీడి పంటను చేర్పించేలా కృషి చేయాలని కోరారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ జీడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీనిచ్చారు. వినతిపత్రం అందజేసిన వారిలో జీడి రైతు సంఘం నాయకులు కుత్తుం వినోద్ కుమార్, నెయ్యల గణపతి, కోనేరు రమేష్, తమ్మినాన భాస్కర్, మద్దు రాఘవరావు, సూరాడ మోహనరావు, అంబటి రామకృష్ణ తదితరులున్నారు.



వినతిపత్రం అందజేస్తున్న జీడి రైతులు

IN THE HONOURABLE COURT OF TH SENIOR CIVIL JUDGE, SOMPETA.
O.S. 65/2018

Between:-
Sathupalli Praveena ---Plaintiff
And:-
Reyyi Ramanamma and others ---Defenadnts

To,
Defendant No. 13:
Dunna Triveni, W/o Laksmana Rao, Aged 29 years, House hold duties Donnuru village, Near Ranigam Mandasa mandal.

the above suit is filed recovery of possession of the plaint schedule properties against you and some others and the suit stands posted to **14-8-2024 at 10.30 AM** for your appearance before the Honourable Court to file objections if any and failing which the matter will be decided in your absence.

Sompeta.
Date: 6-8-2024

VINAYA C. PATNAIK
ADVOCATE,
SOMPETA,
SRIKAKULAM DIST,
CELL: 9440106427.

IN THE HONOURABLE COURT OF TH SENIOR CIVIL JUDGE, SOMPETA.
O.S. 65/2018

Between:-
Sathupalli Praveena ---Plaintiff.
And:
Reyyi Ramanamma and others ---Defenadnts

To,
Defendant No 11: Battina Koteswara Rao, S/o late Prasada Rao Aged 32 years, Cultivation, Door No 3-75, Sindiri street, Bathupuram Vajrapukotturu Mandal.
Defendant No 12: Battina Lavakumar s/o late Prasada Rao, Aged 30 years, Cultivation, Door No 3-75, Sindiri street, Bathupuram Vajrapukotturu Mandal.

NOTICE

Please take notice that the plaintiff filed the above suit for recovery of possession of the plainti schedule properties against you and some others and the suit stands posted to **14-8-2024 at 10.30 AM** for your appearance before the Honourable Court to file objections if any and failing which the matter will be decided in your absence.

Sompeta.
Date: 6-8-2024

VINAYA C. PATNAIK
ADVOCATE,
SOMPETA,
SRIKAKULAM DIST,
CELL: 9440106427.

IN THE HONOURABLE COURT OF THE CIVIL JUDGE (SENIOR DIVISION) SOMPETA.
IA. 219/2024 in IA. 314/2023 in HMOP. 71/2023

Between:-
Tangudu Harikrishna ---Petitioner
And:
Tangudu Kavita ---Respondant

To,
Tangudu. Kavita W/o Harikrishna Near MPDO office, Ponduru Village & Mandal,
Presently residing at:
Tangudu. Kavita, W/o Harikrishna, C/o Manguvari Tota. Near Sampath vinayaka temple, Dumpa Chinnababu Gari House Srikakulam town and District.

NOTICE TO THE SOLE RESPONDANT:

It is to inform you that the above IA219/2024 in IA.314/23 in H.M.O.P 71/2023 on the file of Hon'ble Civil Judge (Senior Division) Sompeta is posted on **12-8-2024,** for your appearance, You are hereby directed to appear before the above court at **10.30 AM. on 12-8-2024**. in person or through an advocate without fail, otherwise matter will be decided in Your absence

// By Court order //
GEDDAPU SRI KRISHNA PRASAD
ADVOCATE,
Plat No:24, Visakha-A Colony,
Srikakulam Town & Dist, Cell:7893450188.

ప్రజాశక్తి
www.prajasakti.com

ఆందోళన చేస్తున్న 'ఉపాధి' కూలీలు

'ఉపాధి' బకాయిలు చెల్లించాలి

ప్రజాశక్తి- కొత్తూరు

ఉపాధి కూలీలకు బకాయిలు తక్షణమే చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు సిర్ల ప్రసాద్, గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు నిమ్మక అప్పన్న డిమాండ్ చేశారు. ఎపి వ్యవసాయ కార్మిక సంఘం, ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యాన మండలంలోని గొట్టిపల్లి పంచాయతీ సచివాలయం వద్ద మంగళవారం ధర్నా చేపట్టారు. అనంతరం సచివాలయం వెల్ఫేర్ అధికారి లక్ష్మీకుమారిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధి కూలీలకు 8 వారాలు బిల్లులు చెల్లించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని అన్నారు. పనిచేసిన 15 రోజుల్లో కూలీలకు కూలి చెల్లించాలని చట్టంలో పొందుపరిచి ఉందన్నారు. ప్రభుత్వాలకు ఉపాధి కూలీల ఆకలి బాధలు పట్టడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లా వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న కోట్లాది రూపాయలు కూలి చెల్లించాలని, లేకుంటే ఉపాధి హామీ కార్యాలయాలన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రామారావు, లక్ష్మి, శివ, వెంకటరావు, గణపతి, రమణ పాల్గొన్నారు.

జెసికి మెమోంటోను అందజేస్తున్న ప్రతినిధులు

ఎస్‌సి, ఎస్‌టి సమస్యల పరిష్కారానికి కృషి
జెసి ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

శ్రీకాకుళం అర్బన్ : జిల్లాలోని ఎస్‌సి, ఎస్‌టిల సమస్యలను తన దృష్టికి తీసుకొస్తే వాటిని పరిశీలించి పరిష్కారం చూపుతానని జెసి ఫర్మాన్ అహ్మద్ ఖాన్ అన్నారు. కలెక్టరేట్‌లోని జెసి ఛాంబర్‌లో ఎస్‌సి, ఎస్‌టి జర్నలిస్టుల అసోసియేషన్ ప్రతినిధులు మంగళవారం ఆయనను కలుసుకొని దుశ్శాలువ కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ నెలలో చివరి శనివారం ఎస్‌సి, ఎస్‌టి సమస్యలపై సమావేశం నిర్వహిస్తున్నామని తెలిపారు. అందులో ఏమైనా సమస్యలు గుర్తించి తన దృష్టికి తీసుకురావాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు గంజి ఆర్ ఎజ్రా, పిన్నింటి అప్పన్న, నందేశ్, నారాయణమూర్తి, తిర్లంగి రామకృష్ణ, ఆకుల అప్పలసూరి, బలగ మోహన్, రాయి రాము, బమ్మిడి వేణుగోపాల్, కిరణ్ కుమార్,జోషప్ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

నేడు పాతపట్నంలో ప్రజా దర్బార్

పాతపట్నం: పాతపట్నంలో బుధవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ప్రజాదర్బార్‌ను నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గ ప్రజల వద్ద నుంచి నేరుగా వారి సమస్యలను స్వీకరిస్తానని అన్నారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు అందుబాటులో ఉంటానని చెప్పారు. నియోజకవర్గ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వేధిస్తున్న ఎరువుల కొరత

- రైతు సేవా కేంద్రాల్లో అరకొరగా పంపిణీ
- ప్రయివేటు దుకాణాల్లో అంతంతమాత్రమే నిల్వలు
- ఆందోళనలో రైతన్నలు

ప్రజాశక్తి- పలాస

రైతన్నలకు ఆదిలోనే హంసపాదులా తయారైంది ఎరువుల పరిస్థితి. ఎరువులు కొరత తీవ్రంగా వేధిస్తున్న ప్రభుత్వం, అధికారులు పట్టించుకోవడం లేదు. రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో లేక ప్రయివేటు దుకాణాల్లో నిల్వలు లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. రైతన్నలకు అండగా టిడిపి కూటమి ప్రభుత్వం ఉంటుందని, విత్తనాలు, ఎరువులు కొరత లేకుండా చూస్తామని మంత్రులు, ఎమ్మెల్యేలు హామీ ఇస్తున్నారే తప్ప అమలుకు నోచుకోవడం లేదు. విత్తనాలు, ఎరువుల కోసం ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఇబ్బందులు లేకుండా పంపిణీ చేస్తామని పాలకులు చెబుతున్నారే తప్ప క్షేత్రస్థాయిలో పంపిణీ చేయడం లేదన్న విమర్శలు రైతన్నల నుంచి జోరుగా వినిపిస్తున్నాయి. యూరియా, డిఎపి కోసం రైతులు నానా అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వం రైతు సేవా కేంద్రాలు, పిఎసిఎస్ ద్వారా 50 శాతం, ప్రయివేటు దుకాణాల ద్వారా 50 శాతం ఎరువులు పంపిణీ చేయాల్సి ఉంది. కానీ, ఆ దిశగా ఎరువులు పంపిణీ చేయకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

అదిగో.. ఇదిగో..

పలాస నియోజకవర్గం పరిధిలో పలాస మండలంలో 10,922 ఎకరాలు, మందస మండలంలో 15,475, వజ్రపుకొత్తూరు మండలంలో 7175 ఎకరాల్లో వరి సాగు చేయాల్సి ఉంది. ప్రస్తుతం పలాస మండలంలో 7175 ఎకరాలు, మందస మండలంలో 5085, వజ్రపుకొత్తూరు మండలంలో 4747 ఎకరాల్లో ఉబాలు, వెదలు వేశారు. నియోజకవర్గం పరిధిలో పలాస మండలంలో డిఎపి 500 మెట్రిక్ టన్నులు, మందస 700 మెట్రిక్ టన్నులు, వజ్రపుకొత్తూరు 300 మెట్రిక్ టన్నులు, యూరియా పలాసకు 800 మెట్రిక్ టన్నులు, మందసకు 1100 మెట్రిక్ టన్నులు, వజ్రపుకొత్తూరు 450 మెట్రిక్ టన్నులు అవసరం. ప్రభుత్వం నియోజకవర్గంలో పరిధిలోని ఏడు పిఎసిఎస్‌లు, రైతు సేవా కేంద్రాలకు పలాస మండలానికి యూరియా 200 మెట్రిక్ టన్నులు, మందసకు 100 మెట్రిక్ టన్నులు, వజ్రపుకొత్తూరుకు 80 మెట్రిక్ టన్నులు, పలాస మండలానికి డిఎపి 145 మెట్రిక్ టన్నులు, మందసకు 185 మెట్రిక్ టన్నులు, వజ్రపుకొత్తూరుకు 40 మెట్రిక్ టన్నులు మాత్రమే ఎరువులు పంపిణీ చేసింది. దీంతో రైతులు ఎరువుల కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఒక్కమాటలో చెప్పాలంటే 50 శాతం రైతు సేవా కేంద్రాలు, పిఎసిఎస్ ద్వారా యూరియా, డిఎపి సరఫరా చేయాల్సి ఉన్నా... ఆ స్థాయిలో ఎరువులు సరఫరా చేయడంలేదనే వాదనా అధికారుల నుంచి వినిపిస్తోంది. యూరియా, డిఎపి అవసరమైన రైతు సేవా కేంద్రాల వద్దకు వెళ్లి అడుగుతున్నా అదిగో ఇదిగో అంటూ కాలయాపన చేస్తున్నారే తప్ప సరఫరా చేయకపోవడంతో రైతులు ప్రభుత్వం, వ్యవసాయశాఖ అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఖరీఫ్ ప్రారంభంలో ఎకరాకు బస్తా డిఎపి, అర బస్తా యూరియా తప్పనిసరిగా వేయాలి. కానీ, రైతు సేవా కేంద్రాలు, పిఏసిఎస్ వద్ద పూర్తి స్థాయిలో ఎరువులు లేకపోవడంతో రైతులు ప్రయివేటు దుకాణాలను ఆశ్రయిస్తున్నారు. అక్కడా పూర్తిస్థాయిలో లేకపోవడంతో రైతులకు ఎరువుల కొరత తీవ్రంగా వేధిస్తోంది. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో ఎరువులు తప్పనిసరి కావడంతో ఏమి చేయాలో తోచక రైతులు ఆందోళన చెందుతున్నారు. యూరియా, డిఎపి సరఫరా చేయాలని పదేపదే వ్యవసాయశాఖ అధికారులకు అడుగుతున్నా... ఫలితం లేకపోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలాస, వజ్రపుకొత్తూరు మండలాల్లో ప్రయివేటు దుకాణాల్లో సుమారు డిఎపి 58 మెట్రిక్ టన్నులు, యూరియా 467 మెట్రిక్ టన్నులు నిల్వలు ఉన్నట్లు తెలుస్తోంది. అయితే రైతులు ప్రయివేటు దుకాణాల వద్దకు వెళ్లి ఎరువులు కొనుగోలు చేసేందుకు వెళ్తున్నా... ఎరువులు లేవని వ్యాపారులు చెబుతుండడం గమనార్హం.

వ్యవసాయశాఖ మంత్రి సొంత జిల్లాలోనే...

టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతులకు అండగా ఉంటుందన్న అనుకున్న తరుణంలో

పెదంచల రైతు సేవా కేంద్రం వద్ద డిఎపి బస్తాలను దించుతున్న కూలీలు (ఫైల్)

ఎరువుల పంపిణీ చేయడంలో విఫలమైంది. సకాలంలో ఎరువులు పంపిణీ చేయలేకపోవడంతో ప్రభుత్వంపై రైతులు పెదవి విరుస్తున్నారు. వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సొంత జిల్లాకు పూర్తిస్థాయిలో ఎరువులు అందించలేని స్థితిలో ఉన్నారు. అటు రైతు సేవా కేంద్రాలు, పిఏసిఎస్‌లకు అందించక ఇటు ప్రయివేటు దుకాణాలకు సరఫరా చేయలేని స్థితిలో ప్రభుత్వం ఉండడంతో ఏమి చేయాలో తోచక రైతులు ఆలోచనలో పడ్డారు. కొంత మంది పలాస నియోజకవర్గానికి సమీపంలో ఒడిశా ప్రాంతం ఉండడంతో అక్కడి నుంచి ఎరువులు కొనుగోలు చేసేనట్లు తెలుస్తోంది. ఇప్పటికైనా ప్రభుత్వం వ్యవసాయ శాఖ అధికారులు చొరవ చూపి యూరియా, డిఎపి బస్తాలను అందుబాటులో ఉంచి రైతులకు రైతు సేవా కేంద్రాల ద్వారా పంపిణీ చేయాలని రైతులు కోరుతున్నారు.

ఎరువులు పంపిణీ చేస్తాం

ఖరీఫ్ సీజన్‌లో డిఎపి, యూరియా తప్పనిసరి. నియోజకవర్గంలో ఎరువులు కొరత ఉండడం వాస్తవం. ఎరువులు పంపిణీ చేయాలని ప్రభుత్వం, జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లా. రైతులు ఎక్కువగా డిఎపి, యూరియా వాడుతున్నారు. డిఎపి, కాంప్లెక్స్, 28280, 2020013, 161616 రకాలు వాడుకోవచ్చు. ప్రస్తుతం అందుబాటులో ఉన్నాయి. కానీ, వాటిని రైతులు వాడడం లేదు. అందువల్లే ఎరువులు కొరత తీవ్రంగా ఉంది. ఎరువులు కొరత లేకుండా చర్యలు చేపడుతున్నాం. ప్రస్తుతం రైతు సేవా కేంద్రాలకు డిఎపి, యూరియా సరఫరా అవుతుంది. వచ్చిన సరుకు అనుగుణంగా రైతులకు పంపిణీ చేస్తున్నాం.

- ఎల్.వి మధు, వ్యవసాయశాఖ ఎడిఎ

ఇబ్బంది పడుతున్నాం

ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో పంటకు యూరియా, డిఎపి అవసరం. యూరియా, డిఎపి అందుబాటులో లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. రైతు సేవా కేంద్రాల్లో యూరియా, డిఎపి నిల్వ లేకపోవడంతో ప్రయివేటు దుకాణాల్లో కొనుగోలు చేస్తున్నాం. వ్యవసాయ అధికారులు చొరవ చూపి యూరియా, డిఎపి అందుబాటులో ఉండేవిధంగా చర్యలు చేపట్టాలని కోరుతున్నాం.

- పేరాడ నాగేశ్వరరావు, కొత్తపూరు

ప్రయివేటు దుకాణాల్లోనూ లేవు

యూరియా, డిఎపి అందుబాటులో లేకపోవడంతో ప్రైవేటు దుకాణాలకు వెళ్లిన యూరియా, డిఎపి దొరకడం లేదు. కొంతమంది వ్యాపారులు యూరియా, డిఎపి నిల్వ ఉన్నప్పటికీ లేదని చెప్పడంతో ఆందోళన చెందుతున్నాం. ప్రభుత్వం సకాలంలో యూరియా, డిఎపి సరఫరా చేయకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

- బమ్మిడి భాస్కరరావు, కొత్తపూరు

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

ప్రజాశక్తి- శ్రీకాకుళం రూరల్

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. మండలంలోని మునసబుపేటలోని హారిక కళ్యాణ మండపంలో మండల, గ్రామస్థాయి అధికారులతో, టిడిపి కూటమి నాయకులతో మంగళవారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. గ్రామాల్లో అపరిశుభ్య నియంత్రణకు చర్యలు చేపట్టాలన్నారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్

శాసనమండలి చైర్మన్‌కి స్వాగతం

ఇచ్ఛాపురం: ఆంధ్రప్రదేశ్ శాసనమండలి చైర్మన్ కొయ్యి మూషేన్ రాజు ఇచ్ఛాపురం నియోజకవర్గంలో పర్యటించారు. ఈ సందర్భంగా సందర్భంగా వైసిపి నాయకులు రాజును సాదరంగా స్వాగతం పలికారు. అనంతరం దుశ్శాలువ కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు నర్తు ప్రేమ్ కుమార్ యాదవ్, వైస్ ఎంపిపి దువ్వు వివేకానందరెడ్డి, సర్పంచ్‌లు నర్తు వరప్రసాద్ యాదవ్, నీలాపు సారధిరెడ్డి, ఇసురు పరశు రామ్ రెడ్డి, పిట్ట బాలరాజురెడ్డి, వలసయ్య పాల్గొన్నారు.

కవిటి: శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు మంగళవారం ఇచ్ఛాపురం నియోజకవర్గం విచ్చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నర్తు రామారావు తదితరులు ఆయనకు కంచిలి మండలం ఆంపురం వద్ద ఘన స్వాగతం పలికారు. ఎమ్మెల్సీ నర్తు రామారావు స్వగృహంలో ముఖ్య నాయకులతో సమావేశమయ్యారు, ఎంపిపిలు,

ఇచ్ఛాపురం : స్వాగతం పలుకుతున్న వైసిపి నాయకులు

జెడ్‌పిటిసిలు, సర్పంచ్‌లు, ఇచ్ఛాపురం మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సనులు, ఎంపిటిసిలు, సోషల్ మీడియా సభ్యులు పాల్గొన్నారు.

నందిగాం : శాసన మండలి చైర్మన్ మోషన్ రాజుకు వైసిపి నాయకులు పేరాడ తిలక్ నందిగాంలో స్వాగతం పలికారు. ఈయనతో పాటు ఎంపిపి శ్రీరామ్మూర్తి, వైసిపి నాయకులు కె.నారాయణమూర్తి, జె.జయ, టి.రాజు, పి.మోహనరావు పాల్గొన్నారు.

వలస మత్స్యకారుడు మృతి

ప్రజాశక్తి- సోంపేట

మండలంలోని రామయ్యప ట్నానికి చెందిన వలస మత్స్యకారుడు వాడ ధర్మారావు (52) చెన్నయ్‌లో జరిగిన బోటు ప్రమాదంలో మంగళవారం మృతి చెందారు. కొద్ది నెలల క్రితం చేపల వేట కోసం చెన్నయ్ వెళ్లాడు. అందులో భాగంగా సముద్రంలోకి వెళ్లడంతో బోటు బోల్తా పడి మృతి చెందాడు. తోటి మత్స్యకారులు అక్కడ సముద్రం ఒడ్డుకు మృతదేహాన్ని తీసుకొచ్చారు. మృతుడికి భార్య జానకి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఇతర రాష్ట్రాల్లో మృతి చెందిన మత్స్యకారులకు ప్రమాద బీమా వర్తించదని, నిరుపేద కుటుంబమైన ధర్మారావు కుటుంబానికి ప్రభుత్వం ఆదుకోవాలని స్థానిక మత్స్యకార సంఘ నాయకులు కోరారు.



చోరీకి గురైన ఫైళ్లు

ఆర్‌డబ్ల్యుఎస్ కార్యాలయంలో చోరీ

పలాస: పలాస మండల పరిషత్ కార్యాలయం సమీపంలో ఆర్‌డబ్ల్యుఎస్ డివిజన్ కార్యాలయంలో మంగళవారం మధ్యాహ్నం 11 గంటల సమయంలో ఇద్దరు వ్యక్తులు గోనె సంచాలతో ఆర్డబ్ల్యూఎస్ కార్యాలయం విలువైన ఫైల్స్, పత్రాలను తీసుకు వెళ్లి ఆర్డబ్ల్యూఎస్ కార్యాలయానికి సమీపంలో ఉన్న చెత్తా దుకాణానికి విక్రయించినట్లు స్థానికులు చూశారు. ఈ విషయాన్ని పలాస ఆర్డబ్ల్యూఎస్ డిఇ దుర్యోధన దృష్టికి తీసుకు వెళ్లారు. వెంటనే మండల పరిషత్ కార్యాలయంలో ఉన్న సిసి ఫుటేజ్‌ను పరిశీలించి చెత్తా దుకాణానికి వెళ్లి చూశారు. గోనె సంచాలతో ఉన్న ఫైల్స్, పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం పాత ఆర్డబ్ల్యూఎస్ కార్యాలయానికి వెళ్లి చూసేసరికి వెనుక భాగంలో ఉన్న కిటికీ పగలు కొట్టి కార్యాలయంలో ఉన్న ఫైల్స్ పత్రాలను అపహరించినట్లు కనిపించింది. ముందుగా ఫైల్స్ పత్రాలను అపహరించినట్లు తెలియడంతో అధికారులు ఆందోళన చెందారు. చివరకు ఫైల్స్ పత్రాలను దొరకడంతో ఊపిరి పీల్చుకున్నారు. ఇదే విషయాన్ని పలాస ఆర్డబ్ల్యూఎస్ డిఇ దుర్యోధనను వివరణ కోరగా పోయిన ఫైల్స్ పత్రాలు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. అవి పాత ఫైల్స్ అని చెప్పారు. ఇదే విషయాన్ని కాశీబుగ్గ సిఐ విజయానంద్‌కు వివరణ కోరగా, ఆర్డబ్ల్యూఎస్ అధికారులు తమ ఫైల్స్ పత్రాలను పోయాయని చెప్పారని, మరలా పోయిన ఫైల్స్ పత్రాలు దొరికాయని చెప్పారని అన్నారు. రాతపూర్వకంగా పిర్యాదు చేయలేదని చెప్పారు.

13న లావేరు మండల సమావేశం

లావేరు : లావేరు మండల సర్వసభ్య సమావేశం ఈనెల 13న నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ కె.కొండలరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉమండల పరిసత్ సమావేశ మందిరంలో ఎంపిపి లుట్టి అమ్మాజమ్మ అధ్యక్షతన ఉదయం 11 గంటలకు ప్రారంభిస్తామని అన్నారు. విధిగా సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, పూర్తి సమాచారంతో మండల స్థాయి అధికారులు హాజరుకావాలన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

డిఎంహెచ్‌ఒ మీనాక్షి

ప్రజాశక్తి- జి.సిగడాం

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని డిఎంహెచ్‌ఒ బొడ్డేపల్లి మీనాక్షి సూచించారు. మండలంలోని మెట్టవలసలో అతిసారతో బాధపడుతున్న రోగిని మంగళవారం పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆహారాన్ని తీసుకోనేటప్పుడు పలు జాగ్రత్తలను తీసుకోవాలన్నారు. గ్రామల్లో రోగులకు వైద్యాధికారులు అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. అనంతరం గ్రామంలో పర్యటించి కోళ్ల ఫారాలను పరిశీలించారు. పాల్ట్రీ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బంది సూచించారు. గ్రామంలో

రోగితో మాట్లాడుతున్న డిఎంహెచ్‌ఒ మీనాక్షి

ఈగలు, దోమలు చొరబడకుండా తగు మందులను పిచికారీ చేయించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు యశ్వంత్, సుమబిందు, మండల పంచాయతీ అధికారి ఎస్.శ్రీనివాసరావు, ఆర్‌డబ్ల్యుసి ఎఇ బగాది భాగ్యలక్ష్మి, కార్యదర్శులు వరపు సతీష్, రాజారమేష్ పాల్గొన్నారు.

పుస్తకాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అశోక్

విద్యార్థులే దేశ సంపద

ప్రజాశక్తి- కవిటి

విద్యార్థులే దేశ సంపదని, క్రమశిక్షణతో చదువుకుని విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు సాధించుకోవాలని ఎమ్మెల్యే బెందాళం అశోక్ అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ విద్యార్థులకు మంగళవారం ఉచితంగా పంపిణీ చేసిన పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యపై ప్రత్యేక శ్రద్ధతో ఉందని అన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పేడాడ రాజేశ్వరరావు, జెడ్‌పిటిసి మాజీ సభ్యుడు బెందాళం రమేష్, మాజీ సర్పంచ్ ఆరంగి మధు, బెందాళం కామరాజు, బి.సురేష్, జి.రామారావు, వజ్జ రంగారావు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి

ప్రజాశక్తి- బూర్జ

గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టిసారించాలని ఇఒపిఆర్‌డి డి.విజయలక్ష్మి సూచించారు. మండలంలోని చీడివలసలో పారిశుధ్య నిర్వహణను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామం నుంచి పలు ఫిర్యాదులు వచ్చాయన్నారు. అయితే ప్రస్తుతం వ్యాధులు సీజన్ కావడంతో వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. కార్యదర్శులు ఎప్పటికప్పుడు గ్రామాలన సందర్శించాలన్నారు. కాలువల్లో, రోడ్లపై మురుగునీరు నిల్వ లేకుండా చూడాలన్నారు.

సమీక్షిస్తున్న ఇఒపిఆర్‌డి విజయలక్ష్మి

చెత్త కుప్పలు లేకుండా చూసుకోవాలన్నారు. ఈమెతో టిడిపి మండల ఉపాధ్యక్షులు పి.కన్నంనాయుడు, కార్యదర్శి రాజారావు ఉన్నారు.

సస్యరక్షణ పద్ధతులతో అధిక దిగుబడి

వరి చేను చిగుర్లను తుంచుతున్న రైతులు

ప్రజాశక్తి- ఆమదాలవలస

వరి పంటలో సస్యరక్షణ పద్ధతులు పాటిస్తే పంట దిగుబడి పెరుగుతుందని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది డిజిటల్ ఎల్ టు సురేష్ అన్నారు. మండలంలోని చేపేనపేట, నిమ్మతొర్లాడ గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయ విభాగంలో భాగంగా సస్యరక్షణ పద్ధతులపై మంగళవారం రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డిపిఎం రేవతి ఆదేశాల మేరకు ప్రధానంగా వరిసాగు చేస్తున్న రైతులు క్షేత్రస్థాయిలో నాట్లు వేసినప్పటి నుంచి పంటలో తీసుకోవలసిన జాగ్రత్తలు పురుగులు, తెగుళ్లు రాకుండా తీసుకోవలసిన మేలైన యాజమాన్య పద్ధతులు గురించి రైతులకు వివరించారు. యూనిట్ ఇన్‌ఛార్జి నక్క చిరంజీవి ఆధ్వర్యాన రైతులతో వరి పంటలో నారు చిగుళ్ల తుంచి లైన్ పద్ధతుల్లో నాట్లు వేయించారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో పెట్టుబడి తగ్గించి దిగుబడులు వచ్చేవిధంగా అదనపు ఆదాయాన్ని పొందేలా క్షేత్రస్థాయిలో ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తిరుపతి, లక్ష్మి, కృష్ణవేణి జానకిరామ్ పాల్గొన్నారు.

మొక్కలతోనే మానవాళికి మనుగడ

ప్రజాశక్తి- పలాస

మానవాళికి మొక్కలు నాటడం అవసరమని రామకృష్ణాపురం సత్యసాయి విద్యా విహార్ పాఠశాల చైర్మన్ మల్లా రామేశ్వరరావు అన్నారు. పాఠశాల ఆవరణలో ప్రేమతరూ ఇంచార్జ్ చంద్రమౌళి పర్యవేక్షణలో మంగళవారం 36 మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మొక్కలు నాటడం ద్వారా ప్రాణ వాయువు అందుతుందన్నారు. పర్యావరణం పరిరక్షణకు ప్రతి విద్యార్థి మొక్కలు నాటాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు తాళాసు శ్రీను, ప్రిన్సిపాల్ ప్రీతిచౌదరి, ఉపాధ్యాయులు కల్పన, కళ్యాణి, సునీత, లలిత, మమత, జయదేవ్‌లు పాల్గొన్నారు.

రణస్థలం: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని హరిత సమగ్ర గ్రామీణాభివృద్ధి సంస్థ వ్యవస్థాపకులు ఆర్.హరిబాబు అన్నారు. హరిత సంస్థ ప్రథమ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని కంబాలపేట, యండల మల్లిఖార్జున స్వామి ఆలయ ప్రాంగణం, పైడిభీమవరం షిర్డీ సాయి మందిర ప్రాంగణం, తాళ్లవలస చెరువుగట్టు వెంబడి మొక్కలు నాటారు. కార్యక్రమంలో హరిత సొసైటీ కార్యదర్శి పి.తవిటినాయుడు, సభ్యులు జి.అప్పలనాయుడు, రావాడ కృష్ణ, రాజశేఖరరెడ్డి అసిరినాయుడు, నారాయణరావు పాల్గొన్నారు.

రణస్థలం : మొక్కలను నాటుతున్న సభ్యులు

ఇచ్ఛాపురం : ప్రతిఒక్కరూ విరివిగా మొక్కలు నాటాలని మాజీ సైనికుల సంక్షేమ సంఘం ప్రతినిధి దక్కత విశ్వనాథ్‌రెడ్డి అన్నారు. మాజీ సైనికులు ఆఫీస్, యూ కాంప్లెక్స్ ఆవరణలో మొక్కలను మంగళవారం నాటారు. కార్యక్రమంలో ప్రసాదరావు, నారాయణ, సోమేశ్‌రెడ్డి, పి.వాసు, కొండా చంద్రయ్యరెడ్డి పాల్గొన్నారు.

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నాగేశ్వరరావు

'ఐతమ్'లో పుస్తకావిష్కరణ

టెక్కలి రూరల్: టెక్కలి ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ ఇంజినీరింగ్ కళాశాల బిఎస్అండ్ హెచ్ విభాగంలో అధ్యాపకులుగా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ మామిడి పాపినాయుడు, వెలగల రాంబాబు, మొదలవలస కృష్ణప్రసాద్, నడిమింటి శైలజలు 'ఎ డబుల్ విజన్ ఇన్ జంపా లహరిస్ వర్క్స్' అనే పుస్తకాన్ని రచించారు. దీనిని కళాశాల ఆవరణలో డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి. నాగేశ్వరరావు మంగళవారం పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పుస్తకం ఆవశ్యకతను వివరిస్తూ విదేశాలకు వలస వెళ్లే వారు పడుతున్న ఇబ్బందులు, ఎదుర్కొంటున్నజాతి వివక్షత వంటి అంశాలపై జంపా లహరి నవల ఆధారంగా అధ్యయనం చేసి రచయితలు ఈ పుస్తకాన్ని రచించారన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, అసోసియేట్ డీన్ డాక్టర్ కె.వేణుగోపాల్, బిఎస్ఇండ్ హెచ్‌హెచ్ఐడిలు డాక్టర్ ఎం.రమణయ్య, డాక్టర్ ఎం.వి.రత్నమణి పాల్గొన్నారు.

రైస్‌మిల్లు కార్మికుల ఆందోళన

ప్రజాశక్తి- మందస

మండలంలోని సిద్దూరు పరిధిలోని రైస్ మిల్లు కార్మికుల వేతనాలు పెంచాలని సిఐటియు ఎన్.గణపతి మిల్లు యాజమ్యానాలకు డిమాండ్ చేశారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద కార్మికులు మంగళవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత రెండేళ్ల క్రితం యాజమాన్యాలకు, కార్మికులకు అప్పటి తహశీల్దార్ సమక్షంలో వేతన పెంపు ఒప్పందం జరిగిందన్నారు. గత ఒప్పంద కాలం ఈ ఏడాది జూన్ 30తో ముగిసిందని, కానీ, ఇప్పటి వరకు నూతన వేతన ఒప్పందానికి రైస్ మిల్లు

ఆందోళన చేస్తున్న కార్మికులు

యాజమాన్యాలు స్పందించకపోవడం సరికాదని అన్నారు. తక్షణమే రైస్ మిల్లు యాజమాన్యాలు స్పందించి వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు కార్యదర్శి కె.కేశవరావు పాల్గొన్నారు.

డిఎస్‌పికి సన్మానం

పలాస: కాశీబుగ్గ డిఎస్‌పి కార్యాలయంలో డిఎస్‌పి పి.శ్రీనివాసరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం డిఎస్‌పిని సన్మానించారు. పలాస ప్రాంతంలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ఉండాలని కోరారు. ఆయనతో పాటు టిడిపి నాయకులు కోట్ని దుర్గాప్రసాద్, సాసుమాన చంద్రమౌళి, యవ్వరి మోహనరావు, అనిల్ శర్మ, జగదీష్ పండా, సంపతరావు ధనుంజయరావు, గూన మన్మథరావు, గంధం కామేశ్వరరాఘున్నారు.

శ్రీకాకుళం అర్బన్ : మాట్లాడుతున్న సభ్యులు

తల్లిపాలు బిడ్డకు అమృతం

కోటబొమ్మాళి: సమాజంలో తల్లిపాలు బిడ్డకు అమృతమని, ముర్రుపాలు బిడ్డలకు ఔషధమని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ మనోహరి అన్నారు. మండలంలోని విశ్వనాథపురంలోని అంగన్వాడీ కేంద్రంలో నిర్వహించిన తల్లిపాలు వారోత్సవాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. అనంతరం గర్భిణులకు బాలింతలకు పోషకాహారం అందించారు. కార్యక్రమంలో ఆంగన్వాడీ సిబ్బంది శ్రీదేవి, భవాని పాల్గొన్నారు.

బూర్జ : తల్లిపాలు బిడ్డలకు శ్రేష్టమని ఎంపిపి కర్నెన దీప అన్నారు. మండలంలోని లక్కుపురంలోని అంగన్వాడీ కేంద్రంలో తల్లిపాలు వారోత్సవాల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బి.విజయలక్ష్మి అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కవిటి: పుట్టిన గంటలోపు తప్పనిసరిగా తల్లిపాలు (ముర్రిపాలు) అందించాలని టిడిపి నాయకులు మణిచంద్రప్రకాష్, సంతోష్ పట్నాయక్, బాసుదేవ్ రౌలో, బార్ల చినబాబు అన్నారు. మండలంలోని ప్రగడపుట్టుగ, జాడుపూడి, బల్లిపుట్టుగ అంగన్వాడీ కేంద్రాల్లో మంగళవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్ వైజర్లు సుజాత, పల్లవి, బల్లెడ శంకరరావు, బండారు మిన్నారావు, పిరియా సత్యం, బదకల ఎర్రయ్య పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : మండలంలోని ఈదుపురం అంగన్వాడీ కేంద్రం పరిధిలోని తల్లిపాలు ప్రయోజనాలపై సర్పంచ్ నర్తు వరప్రసాదరావు అధ్యక్షతన అవగాహనా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి దువ్వు వివేకానందరెడ్డి, ఎంపిటిసి ప్రతినిధి నర్తు ప్రేమ్‌కుమార్, ఆరో వార్డు మెంబరు ఉప్పాడ నాగమ్మ, ఎంఎల్‌హెచ్‌పి దివ్యరెడ్డి, కౌన్సిలర్ ఆసీ లీలారాణి, అంగన్వాడీ కార్యకర్తలు జయలక్ష్మి పట్నాయక్, స్మితాదాసు, శ్రీదేవి, మహిళా పోలీసు రాజేశ్వరి పాల్గొన్నారు.

పోలాకి : పోలాకి పిహెచ్‌పిలో నిర్వహించిన తల్లిపాలు వారోత్సవంలో డాక్టర్ శ్రీనాథ్, నల్లి రవికుమార్, బరాటం లక్ష్మి, ఎఎన్ఎంలు పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్ : జెమ్స్ కమ్యూనిటీ మెడిసిన్ డిపార్ట్‌మెంట్, ఐసిడిఎస్ సంయుక్తంగా నగరంలోని గూనపాలెం అంగన్వాడీ కేంద్రంలో తల్లిపాలు వారోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో సిడిపిఒ శోభారాణి, జెమ్స్ కమ్యూనిటీ మెడిషన్ డిపార్ట్‌మెంట్ హెచ్‌ఒడి డాక్టరు స్ఫర్షిబోస్, టిడిపి నాయకులు కొర్ను ప్రతాప్, డి.హరి, పి.రాజు, చిట్టిబాబు, జయమ్మ, విజయ, సూపర్‌వైజర్ యోగేశ్వరి పాల్గొన్నారు.

శ్రీకాకుళం లయన్స్ క్లబ్ సెంట్రల్ అధ్యక్షులు డాక్టర్ బొడ్డేపల్లి సురేష్ ఆధ్వర్యాన నగరంలోని సిందూర ఆస్పత్రి ఆవరణలో తల్లిపాలు వారోత్సవాలను నిర్వహించారు. కార్యక్రమంలో సిందూరు ఆస్పత్రి గైనకాలజిస్ట్ డాక్టర్ మాలతి, జోన్ చైర్మన్ పొన్నాడ రవికుమార్, నటుకుల మోహన్, జిల్లా చైర్మన్ డాక్టర్ బాడాన దేవభూషణరావు పాల్గొన్నారు.

పొందూరు: తల్లిపాలులో పోషకాలు ఎక్కువగా ఉండటంతో పిల్లల్లో రోగ నిరోధక శక్తిపెరుగుతుందని ఆముదాలవలస ప్రాజెక్టు సిడిపిఒ ఎస్.అనురాధ అన్నారు. మండలంలోని లోలుగు సెక్టార్ పరిధిలోని బురిడికంచరాం అంగన్వాడీ కేంద్రం-3 లో

పొందూరు : మాట్లాడుతున్న సిడిపిఒ అనురాధ

మంగళవారం తల్లిపాలు వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బిడ్డ పుట్టిన గంటలోపు తల్లిపాలను అందించడం ద్వారా బిడ్డకు ఎంతో శ్రేయస్కరమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా తల్లిపాల ప్రాముఖ్యతను బాలింతలకు, గర్భిణులకు తెలియజేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ జి.వి.రత్నం, సచివాలయం మహిళా పోలీస్ భార్గవి పాల్గొన్నారు.

కొత్తూరు : మండలంలోని మెట్టూరు సెక్టార్ పరిధిలోని గొట్టిపల్లి అంగన్వాడీ కేంద్రంలో గర్భిణులకు సామూహికంగా సీమంతాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ పిఒ విమలరాణి, వైస్ ఎంపిపి లోతుగెడ్డ తులసీవరప్రసాదరావు, ఎంపిటిసి పి.సింహాచలం, టిడిపి నాయకులు లోతుగెడ్డ లక్ష్మీనారాయణ, కె.సంజీవరావు, జి.తిరుపతిరావు, బి.తమ్మినాయుడు, పి.నాగభూషణంరావు, టి.రామారావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న భైరాగినాయుడు

వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలి

ప్రజాశక్తి- పోలాకి

పోలాకి ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలని ఎంపిపి ప్రతినిధి ముద్దాడ భైరాగినాయుడు అన్నారు. పోలాకి పిహెచ్‌సి ఆవరణలో డాక్టర్ శ్రీనాథ్ అధ్యక్షతన ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు 12 అంశాలపై తీర్మానాన్ని సభ ముందు ఉంచగా, ఆ తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించారు. అనంతరం మాట్లాడుతూ ఆస్పత్రిలో సమావేశాలు సజావుగా నిర్వహించుకోవడానికి అణువుగా సమావేశ మందిర నిర్మాణానికి తగిన నిధులను మంజూరు చేస్తారని హామీ ఇచ్చారు. సిబ్బంది ఈ అంశంపై హర్షం వ్యక్తం చేశారు. సర్పంచ్ రమణమ్మ మాట్లాడుతూ పోలాకి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది అంకితభావంతో పనిచేస్తున్నారని కితాబిచ్చారు. ఎంపిడిఒ ఉషశ్రీ వివిధ జాతీయ కార్యక్రమాల అమల్లో సఫలీకృతంగా కృషి చేస్తున్న సిబ్బందిని అభినందించారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఎం.సురేష్‌కుమార్, డాక్టర్లు సుమప్రియ, నల్లి రవికుమార్ పాల్గొన్నారు.

9 నుంచి నిరుద్యోగులకు ఉచిత శిక్షణ

ప్రజాశక్తి- పాతపట్నం

మాట్లాడుతున్న రవికుమార్

పాతపట్నం నియోజకవర్గం లోని జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి కొరికాన భవాని ఆధ్వర్యాన ప్రభుత్వ ఉద్యోగాలకు సంబంధించి నిరుద్యోగులకు ఈ నెల 9 నుంచి ఉచితంగా శిక్షణణిస్తున్నామని ప్రముఖ పారిశ్రామిక వేత్త కొరికాన రవికుమార్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం విలేకరులతో మాట్లాడారు. జనసేన అధినేత, డిప్యూటీ సిఎం కొణిదెల పవన్‌కళ్యాణ్ ఆలోచనలతో ప్రభుత్వ రంగ ఉద్యోగాలకు సంబంధించి నియోజవర్గంలోని నిరుపేద విద్యార్థులకు ఈ అవకాశం కల్పిస్తున్నామని అన్నారు. డిఎస్‌సి, ఇతరత్రా ప్రభుత్వ రంగ ఉద్యోగాలకు శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. ఈయనతో పాటు నక్క కాంతికుమార్ ఉన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న వెంకటరావు

నాయీబ్రాహ్మణ సంక్షేమానికి కృషి

శ్రీకాకుళం: జిల్లాలో నాయీబ్రాహ్మణ సంక్షేమానికి తన వంతు కృషి చేస్తానని జిల్లా నాయీబ్రహ్మణ సాధికార కమిటీ అధ్యక్షులు కుప్పిలి వెంకటరావు అన్నారు. ఎల్ఎన్‌పేట మండలం కేంద్రంలో మంగళవారం స్థానిక కమ్యూనిటీ హాల్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాయీబ్రాహ్మణకు ప్రభుత్వం కేటాయించిన నిధులు, పథకాలు ప్రతిఒక్కరికీ అందేలా పనిచేస్తానని హామీ ఇచ్చారు. జిల్లాలోని ప్రతి మండలంలోనూ నాయీబ్రహ్మణులంతా యూనియన్‌గా ఏర్పడి సమస్యల పరిష్కారానికి పనిచేయాలని సూచించారు. అనంతరం నియోజకవర్గంలోని ఐదు మండలాల నుంచి ఒక కోర్ కమిటీని ఎన్నుకున్నారు. సమావేశంలో నాయకులు నౌగాక నాగరాజు, ఎల్ఎన్‌పేట మండల అధ్యక్షులు ఎం మల్లేశ్వరరావు, ఉపాధ్యక్షులు కల్లేపల్లి భాస్కరరావు, కార్యదర్శి ఎ.బాలకృష్ణ పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలతో జీవితాలు నాశనం

ప్రజాశక్తి- నరసన్నపేట

జిల్లాలో జరుగుతున్న మాదకద్రవ్యాల వ్యాపారంపై చర్యలు తీసుకోవాలని డాక్టర్ గొలివి మోహనరావు కోరారు. జ్ఞాన జ్యోతి కళాశాలలో అఖిల భారత యువజన సమాఖ్య ఆధ్వర్యాన జిల్లా ప్రధాన కార్యదర్శి కొన్న శ్రీనివాసరావు అధ్యక్షతన మాదకద్రవ్యాలపై చర్యలు - నియంత్రణ అనే అంశంపై మంగళవారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మత్తు పదార్థాలు సేవించడం ద్వారా విద్యార్థుల జీవితాలు చిన్నాభిన్నం అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

పోలాకి : మాట్లాడుతున్న మోహనరావు

ఆరోగ్య సమస్యలు, శరీరంలో ఉన్న అవయవాలన్నీ దెబ్బతింటాయని అన్నారు. వీటిపైనా పూర్తిగా విద్యార్థులే బాధ్యత తీసుకుని గంజాయి, మత్తు పదార్థాల నుంచి ప్రజలను చైతన్యవంతం చేయడంలో కీలకపాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎఐవైఎఫ్ నాయకులు రాజు, రాము, జ్ఞాన జ్యోతి కళాశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆమదాలవలస : మాదకద్రవ్యాల వినియోగంతో యువత జీవితాన్ని నాశనం చేసుకోవద్దని సిఐ వాయునందన్ యాదవ్ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల సెయింట్ ఆన్స్ ఉన్నత పాఠశాలలో మాదకద్రవ్యాల వినియోగంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్ఐ కె.వెంకటేష్ కళాశాల ప్రిన్సిపాల్ ఎన్.ఎస్.ఎన్.స్వామి, సెంట్ అన్స్ హెడ్ సిస్టర్ వందన పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయులు

117 జిఒ రద్దు చేయాలి

శ్రీకాకుళం అర్బన్ : విద్యారంగంలో పెద్ద సమస్యగా పరిణ మించిన జిఒ నంబరు 117ను తక్షణమే రద్దు చేయాలని ఎపి ఎస్‌సి, ఎస్‌టి ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోనెల రమేష్ ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. ఈ మేరకు డిఇఒ తిరుమల చైతన్యను మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హైస్కూల్ ప్లస్ పేరును జిల్లా పరిషత్ జూనియర్ కళాశాలగా మార్పు చేయాలన్నారు. ప్రస్తుతం అమలు చేస్తున్న బాలికల హైస్కూల్ ప్లస్‌ను పెరిగిన డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని కో ఎడ్యుకేషన్‌గా మార్చాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో సంఘం రాష్ట్ర సహ కార్యదర్శి సోరి ప్రసాదరావు, జిల్లా అధ్యక్షుడు వడమ శరత్ పాల్గొన్నారు.

మహిళా సమాఖ్య మండల అధ్యక్షులుగా సుశీల

కోటబొమ్మాళి: స్థానిక వెలుగు కార్యాలయంలో మంగళవారం జరిగిన మండల మహిళా సమాఖ్య ఎన్నికల్లో నిమ్మాడకు చెందిన ఎం.సుశీల అధ్యక్షులుగా, కిష్టుపురానికి చెందిన పి.వరలక్ష్మి, ఉపాధ్యక్షులుగా ప్రకాశనగర్ కాలనీకి చెందిన ఎం.రమణమ్మ కోశాధికారి గా, జగన్నాథపురానికి బి.అన్నపూర్ణ కార్యదర్శిగా, కన్నేవలసకు చెందిన ఎం.సీతమ్మ సంయుక్త కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ ఎన్నికల అధికారిగా హనుమంతు శర్వాణి వ్యవహరించారు. ఎన్నికైన వారికి పలువురు వెలుగు సిబ్బంది అభినందించారు.

ఘనంగా ఆవిర్భావ దినోత్సవం

శ్రీకాకుళం : స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆఫీసర్స్ అసోసియేషన్ అమరావతి సర్కిల్ ఏడో ఆవిర్భావ దినోత్సవ వేడుకలను నగరంలో యూనియన్ నాయకులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రీజనల్ ఆఫీసులో కేక్ కట్ చేసిన నాయకులు సంబరాలు జరుపుకున్నారు. అనంతరం నగరంలోని బెహరా మనో వికాస కేంద్రంలో చిన్నారులకు అల్పాహారం అందజేశారు. కార్యక్రమాల్లో స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా ఆఫీసర్స్ అసోసియేషన్ జిల్లా రీజనల్ సెక్రటరీ పి.కృష్ణకిషోర్, సంఘ నాయకులు పి.చక్రవర్తి, భాస్కరరావు, కృష్ణంరాజు, సుమన్, సంతోష్, నేతాజీ, వీరభద్రరావు పాల్గొన్నారు.

చెరువు ఆక్రమణలు తొలగించాలి

సోంపేట : మండలంలోని కొర్లం పంచాయతీ పరిధిలోని కంకర గుమ్మి చెరువు అక్రమణాలను తొలగించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని రైతులు కోరారు. ఈ మేరకు తహశీల్దార్ అప్పలస్వామిని మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. గ్రామానికి సమీపంలోని కంకర గుమ్మిలో నిల్వ ఉండే నీటిపై సమీపంలోని తాటిగుడ్డి భూమి రైతులు ఆధారపడి పంటల పండిస్తున్నారని తెలిపారు. జాతీయ రహదారి విస్తరణలో భాగంగా కంకర గుమ్మికి ఆనుకొని ఉన్న ఇళ్ల స్థలాలకు నష్టపరిహారం చెల్లించి ఆ స్థలాన్ని రహదారిలో కలిపారని అన్నారు. అయితే ఆ స్థలం యజమానులు మరలాచెరువు స్థలాన్ని ఆక్రమించి ఇళ్ల నిర్మాణాలు చేపట్టారని చెప్పారు. వీటిపై విచారణ చేసి ఆక్రమణల తొలగించాలని కోరారు.

వినతిపత్రం అందజేస్తున్న రైతులు

కోరారు. కార్యక్రమంలో రైతులు పి.సోమేశ్వరరావు, రామ్‌బుడ్డి ఉమామహేశ్వర రావు, తామడ వాసుదేవరావు, రత్నాల వెంకటరమణ, సంగారు ఢిల్లీరావు, రాబుద్ది జానకిరామ్, రాజేష్, సర్పంచ్ ప్రతినిధి రామ్‌బుడ్డి గణపతి పాల్గొన్నారు.

మైనర్లు వాహనాలు నడపరాదు

మాట్లాడుతున్న ట్రాఫిక్ ఎస్ఐ సందీప్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

మైనర్లు వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమని ట్రాఫిక్ ఎస్ఐ సందీప్ అన్నారు. నగరంలోని ప్రభుత్వ మహిళా కళాశాల డిపార్ట్‌మెంట్ ఆఫ్ కామర్స్ విభాగం ఆధ్వర్యాన సైబర్ నేరాలు-మైనర్ డ్రైవింగ్స్ అనే అంశంపై. విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సైబర్ నేరగాళ్ల నుంచి తమనను తాము రక్షించుకునేందుకు అప్రమత్తత ఏకైక మార్గమన్నారు. అపరిచిత వ్యక్తులు ఫోన్‌లో వివరాలు అడిగినప్పుడు వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. బ్యాంకు లావాదేవీలను ఎప్పుడూ ఇతరులతో పంచుకోవద్దని సూచించారు. సైబర్ నేరాలకు 1930 ఫోన్ నంబరు, ఇతర నేరాలకు 100కు ఫోన్ చేయాలన్నారు. తక్షణమే స్పందించి చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ పైడి శంకర్‌నారాయణ, కామర్స్ విభాగాధిపతి కృష్ణారావు, అకాడమిక్ కో-ఆర్డినేటర్ సిహెచ్.కృష్ణారావు, పద్మావతి, అధ్యాపకులు బి.సంతోషి పట్నాయక్, యు.పావని పాల్గొన్నారు.

ముమ్మరంగా జంగిల్స్ పనులు

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

మండలంలోని అసిరి పోలమ్మ తల్లి ఆటో యూనియన్ సభ్యులు మంగళవారం డోకులపాడు, పల్లిసారథి గ్రామాల మధ్య శ్రమదానంతో జంగిల్ క్లీరెన్స్ చేపట్టారు. రోడ్డుకి ఇరువైపులా ముళ్ల పొదలు, పిచ్చి మొక్కలు అల్లుకోవడంతో వాహనచోదకులు ఇబ్బందులు పడేవారు. దట్టంగా అల్లుకొని రోడ్డు వరకు వ్యాపించిన ముళ్ల పొదలు వల్ల ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు చోటుచేసుకొనేవి. దీంతో స్పందించిన యూనియన్ సభ్యులు శ్రమదానంతో ముళ్ల పొదలను తొలగించారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ గౌరవాధ్యక్షులు తామాడ సోమేశ్వరరావు, అధ్యక్షుడు పోతనపల్లి కోదండరాం, ఉపాధ్యక్షుడు సాన కృష్ణారావు, కోశాధికారి తామాడ లక్ష్మీపతి, కార్యదర్శి రెయ్యి హేమంతరావు, ఆర్గనైజర్ మడ్డు మధు, యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

ముళ్లపొదలను తొలగిస్తున్న సభ్యులు

జ్ఞాపికలను అందిస్తున్న ప్రిన్సిపాల్, సిఐ

ఉల్లాసంగా ఉత్సాహంగా...

ఇచ్ఛాపురం : పట్టణంలోని మహిళా జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ బి.శంకరరావు అధ్యక్షతన విద్యార్థులు మంగళవారం ఫ్రెషర్స్ డే నిర్వహించి ఉల్లాసంగా... ఉత్సాహంగా గడిపారు. విద్యార్థులు సినీగీతాలకు నృత్యాలు చేశారు. అనంతరం విద్యార్థులకు జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో సిఐ ఇ.ఇమ్మాన్యుల్‌రాజు, ఎస్ఐ సత్యనారాయణ, బారువ, కంచిలి ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లు మహేష్, జగదీష్, పూర్వ ప్రిన్సిపాళ్లు రజనీకుమారి, నవ్యశ్రీ మహంతి, ఇచ్ఛాపురం డిగ్రీ కళాశాల రసాయనశాస్త్ర అధ్యాపకులు శివకుమార్ పాల్గొన్నారు.

రికార్డు స్థాయిలో సభ్యత్వ నమోదు

ప్రజాశక్తి- పలాస

దుర్గారావు

జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జనసేన పార్టీ నాలుగో విడత క్రియాశీలక సభ్యత్వ నమోదు యజ్ఞంలా చేశామని పలాస నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ వి.దుర్గారావు తెలిపారు. కాశీబుగ్గలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. జూలై 18 నుంచి ఈ నెల 5 వరకు నియోజకవర్గంలో 6,302 రికార్డు స్థాయిలో సభ్యత్వ నమోదును చేపట్టామని పేర్కొన్నారు. పార్లమెంటరీ పరిధిలోని పలాస నియోజకవర్గం రెండో స్థానంలో నిలిచిందన్నారు. వజ్రపుకొత్తూరు మండలం పెద్దమురహరిపురానికి చెందిన అర్జీ తులసీరావు 607 సభ్యత్వాలు చేయించి పవన్ కళ్యాణ్‌తో అభినందనలు పొందారని అన్నారు. సభ్యత్వం చేయించుకోవడం వల్ల రూ.5 లక్షలు ప్రమాద జీవిత బీమా సౌకర్యం, రూ.50 వేలు ప్రమాద బీమా సౌకర్యం, సభ్యులకు ఇన్సూరెన్స్ వర్తిస్తుందని తెలిపారు.

పుష్పగుచ్ఛం అందజేస్తున్న టిడిపి నాయకులు

లక్ష్మీనారాయణకు అభినందనలు

ప్రజాశక్తి- నౌపడ

సంతబొమ్మాళి మండలం చెట్ల తాండ్ర పంచాయతీ కృష్ణచంద్రాపురానికి చెందిన మెండ లక్ష్మీనారాయణ రాష్ట్ర ప్రభుత్వ న్యాయవాదిగా బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు మండలానికి చెందిన పలువురు టిడిపి నాయకులు అమరావతిలోని ఆయన కార్యాలయంలో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలియజేశారు. తమ ప్రాంతం నుంచి బిసి కేటగిరీకి చెందిన లక్ష్మీనారాయణను రాష్ట్ర పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమించినందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో గోవిందపురం ఎంపిటిసి మెండ త్రినాథరావు, మండల తెలుగు యువత అధ్యక్షులు కూచెట్టి భానుప్రకాష్, మండల ఐటిడిపి అధ్యక్షులు బెండి అరుణ్ కుమార్, వడ్డితాండ్ర నారాయణ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న తహశీల్దార్ హనుమంతరావు

ఈ-పంట నమోదు వేగవంతం

ప్రజాశక్తి- మెళియాపుట్టి

ఈ-పంట నమోదు వేగవంతం చేయాలని తహశీల్దార్ నందిగాం హనుమంతురావు సూచించారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో గ్రామ రెవెన్యూ అధికారులతో, వ్యవసాయ సహాయకులతో ఈ-పంట నమోదు ప్రక్రియపై మంగళవారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ ఏడాది వివిధ పంటల పండించే ప్రతి రైతుతోనూ ఈ-పంట నమోదు చేయించాలన్నారు. దీంతో ప్రభుత్వం అమలు చేసిన ప్రతి పథకమూ వర్తిస్తుందని అన్నారు. ఈ-పంట ప్రక్రియ సెప్టెంబరు 15లోగా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో మండల ఎఒ దానకర్ణుడు పాల్గొన్నారు.

కలుషిత నీటితో వ్యాధులు

బూర్జ : ఫ్లోరోసిస్ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని గుత్తావెల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి రాజశేఖర్ అన్నారు. మండలంలోని కొల్లివలస కెజిబివి పాఠశాల విద్యార్థులకు ఫ్లోరోసిస్ వ్యాధి నియంత్రణపై మంగళవారం వివరించారు. విద్యార్థులు కలుషితమైన నీరు తాగడం వల్ల ఈ వ్యాధి వ్యాప్తంగా అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ మెడికల్ ఆఫీసర్ రమ్య, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాల ఆకస్మిక తనిఖీ

విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఇఒ

మెళియాపుట్టి: మండలంలోని పెద్దగుమ్మడ పాఠశాలను ఎంఇఒ-2 మల్లారెడ్డి పద్మనాభరావు మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థులకు అందిస్తున్న భోజనాలను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడి సంతృప్తి వ్యక్తం చేశారు. ఇప్పటి నుంచే బాగా చదివి మంచి పేరు తీసుకురావాలన్నారు. పాఠశాలకు మరుగుదొడ్లు, ప్రహరీ సమస్య ఉందని గుర్తించామని, దీనిపై ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తానని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి.శ్రీధర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వసతిగృహ విద్యార్థుల ధర్నా

ధర్నా నిర్వహిస్తున్న విద్యార్థులు

శ్రీకాకుళం అర్బన్ : జిల్లా వ్యాప్తంగా బిసి, ఎస్‌సి, ఎస్‌టి వసతి గృహాల్లో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని ఎఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు సిహెచ్.రవి ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టరేట్ వద్ద మంగళవారం వసతిగృహ విద్యార్థులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మాట్లాడుతూ విద్యారంగ సమస్యలతో పాటు ప్రభుత్వ హాస్టళ్ల లోని సమస్యలను పరిష్కరించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న కాస్మోటిక్, మెస్ ఛార్జీలు తక్షణమే విడుదల చేయాలన్నారు. నూతన భవనాలను నిర్మించాలన్నారు. ఖాళీగా ఉన్న వార్డెన్లను, కుక్కలను, అటెండర్లను, కామాటిలను నియమించాలన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం కొనసాగించి విద్యార్థుల అడ్మిషన్లు పెంచేందుకు ప్రభుత్వం కృషి చేయాలన్నారు. ఉన్నత చదువులకు దూరం చేసే జిఒ నంబరు 77ను తక్షణమే రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ నాయకులు పవన్, జీవన్, అఖిల్, కుమార్, అనిల్ జస్వంత్ పాల్గొన్నారు.

అటవీ సంరక్షణ చట్టం రద్దుకు ఉద్యమం

ఆందోళన చేస్తున్న ఆదివాసీలు

ప్రజాశక్తి- మందస

అటవీ సంరక్షణ చట్టం రద్దుకు ఉద్యమిద్దామని ఎఐకెఎంఎస్ జిల్లా నాయకులు గొరకల బాలకృష్ణ పిలుపునిచ్చారు. మండలంలోని కొండలోగాం ఆదివాసీ గ్రామంలో మంగళవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆదివాసీలను అడవి నుంచి తరిమి వేసి, అటవీ సంపదను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టేందుకు ప్రయత్నిస్తుందని అన్నారు. కార్యక్రమంలో ఆదివాసీ నాయకులు సవర పున్నయ్య, సవర సంతోష్, సవర రామయ్య, సవర రామారావు, పిఒడబ్ల్యు జిల్లా ప్రధాన కార్యదర్శి పోతనపల్లి కుసుమ తదితరులు పాల్గొన్నారు.

జనసేన సభ్యత్వ నమోదులో ఆదర్శం

ప్రజాశక్తి- లావేరు

జనసేన పార్టీ నిర్వహించిన క్రియాశీలక సభ్యత్వ నమోదులో ఎచ్చెర్ల నియోజకవర్గం ఆదర్శంగా నిలుస్తోందని ఇన్‌ఛార్జి డాక్టర్ విశ్వక్సేన్ అన్నారు. లావేరులో క్రియాశీలక సభ్యత్వ నమోదు కేంద్రన్ని మంగళవారం మంగళవారం పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ వరకు పది వేలు పైచిలుక క్రియాశీలక సభ్యత్వాలు నమోదైందని అన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు కె.బాబాజీ, కోలా రాజేష్, గుగ్గిలాపు స్వప్న, కొమ్మూరి శ్రీను, దాసరి బలరాం, వడ్డాన శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పరిశీలిస్తున్న విశ్వక్సేన్

ధర్నా చేస్తున్న సెక్యూరిటీగార్డులు

రిమ్స్ సెక్యూరిటీగార్డుల ధర్నా

శ్రీకాకుళం అర్బన్ : మూడు నెలలుగా సెక్యూరిటీ గార్డులకు వేతనాలు చెల్లించడం లేదని, తక్షణమే వేతనాలు చెల్లించాలని రిమ్స్ ఆస్పత్రి ఆవరణలో కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు అన్నెపు సూర్యనారాయణ, దమ్ము సింహాచలంలు డిమాండ్ చేశారు. ఈ మేరకు రిమ్స్ ఆవరణలో మంగళవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేతనాలు సక్రమంగా చెల్లించకపోవడంతో ఆర్థికపరమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు, తక్షణమే ప్రభుత్వం జోక్యం చేసుకుని నెలవారీ వేతనాలు చెల్లించాలని కోరారు. సమాన పనికి సమాన వేతనం చెల్లించాలన్నారు. అలాగే ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. బాన్న అప్పన్న, హనుమంతు లక్ష్మణరావు, తణుకు సంతోషి, దుర్గాసి గోవిందమ్మ, కె.రాజేశ్వరి, లావణ్య, నక్క శశిరేఖ, రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

ప్రజాశక్తి- సోంపేట

సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎంపిపి నిమ్మన దాసు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండలస్థాయి అధికారులతో మంగళవారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలు ముమ్మరంగా చేపట్టాలన్నారు. ఉపాధి హామీ పనులపై సమీక్ష జరిపి వివరాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ రామారావు, కార్యదర్శులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపిపి దాసు

హుండీ ఆదాయం రూ.1.83 లక్షలు

టెక్కలి రూరల్ : మండలంలోని రావివలసలో ఉన్న ఎండలమల్లికార్జున స్వామి ఆలయ హుండీ ఆదాయం 151 రోజులకు రూ.1,83,252 వచ్చినట్లు ఆలయ ఇఒ వాకచర్ల రాధాకృష్ణ తెలిపారు. ఆలయం ఆవరణలో ఆమదాలవలస దేవాదాయశాఖ ఇఒ టి.రవి ఆధ్వర్యాన స్వామి హుండీ ఆదాయాన్ని మంగళవారం లెక్కించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బడే జగదీష్, టెక్కలి దేవాదాయశాఖ సిబ్బంది గోవింద్, శివ, ఆలయ అర్చకులు ఉన్నారు.

పరిసరాలను పరిశీలిస్తున్న సత్యనారాయణ

విద్యార్థులకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి- కంచిలి

మండలంలోని నువాగడ గిరిజన ఆశ్రమ పాఠశాలను మంగళవారం జిల్లా మలేరియా అధికారి సత్యనారాయణ సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో పరిసరాలను పరిశీలించి తగు సూచనలు అందజేశారు. పాఠశాలలోని విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అందులో 8 మంది విద్యార్థులకు మలేరియా లక్షణాలు ఉండడంతో వారికి వైద్యం కోసం సోంపేట ప్రభుత్వాస్పత్రికి రిఫర్ చేశారు. పరిసరాల పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈయనతోపాటు ప్రపంచ బ్యాంకు ప్రతినిధి శ్రీకాంత్, ఎంపిడిఒ నీరజ, హెచ్ఎం దుర్గాప్రసాద్‌పాడి ఉన్నారు.

ఆర్థికసాయం అందజేస్తున్న సభ్యులు

చిన్నారి ఆపరేషన్‌కు ఆర్థికసాయం

కంచిలి : మండలంలోని కర్తలికి చెందిన తాతయ్య, ధనలక్ష్మి దంపతుల కుమారుడు హృషికేష్ ఆట పాటలతో అలరించల్సిన వయసులో కేన్సర్ వ్యాధికి గురయ్యారు. చికిత్సకు రూ. 25 లక్షల వరకు ఖర్చు అవుతుందని వైద్యులు చెప్పారు. అయితే నిరుపేద కుటుంబం కావడంతో వైద్య ఖర్చులు భరించలేని స్థితిలో ఉన్నారు. విషయం తెలుసుకున్న గ్రామ యువకులు ఎస్‌జిఎఫ్ సంస్థ దృష్టికి తీసుకెళ్లారు. సంస్థ సభ్యులు విశాఖపలోని మెడికవర్ ఆస్పత్రిలోని బాబును పరామర్శించి కుటుంబానికి భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో సభ్యులు ఢిల్లేశ్వరి పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

జి.సిగడాం : మండలంలోని పెనసాంకు చెందిన జనసేన జిల్లా సెక్రెటరీ తాలబత్తుల పైడిరాజు ఇటీవల ఆపరేషన్ చేయించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు మంగళవారం ఆయన సగృహానికి వెళ్లి పరామర్శించారు. కార్యకర్తలకు అండగా ఉంటానని హామీనిచ్చారు. ఈయన వెంట ముప్పిడి సురేష్, జనసేన మండల అధ్యక్షులు మీసాల రవికుమార్, వెంకటరావు పాల్గొన్నారు.

పరామర్శిస్తున్న ఎమ్మెల్యే ఈశ్వరరావు